సామాజిక న్యాయం కోసం..

- శరవేగంగా కులగణన సర్వే
- అన్ని సామాజిక వర్గాల మెరుగైన జీవనానికి ఈ సర్వే చేపట్టిన ప్రభుత్వం
- ద్వారకాతిరుమల మండలంలో 95.33 శాతం సర్వే పూర్తి
- వలస వెళ్లిన వారిని గుర్తించేందుకు చర్యలు


ద్వారకాతిరుమలలో ఒక ఇంటి వద్ద కులగణన సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

ద్వారకాతిరుమల: నవరత్నాలతో ఇప్పటికే అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సామాజిక వర్గాలకు మెరుగైన జీవనం ఉండాలని, అందుకు అందరికీ తగిన న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో రాష్ట్రంలో కులగణన సర్వేకు శ్రీకారం చుట్టారు. సామాజిక సాధికారతకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని, దానికి చర్యలు చేపట్టింది. వంద సంవత్సరాల తర్వాత కులగణనకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే తుది దశకు చేరుకుంది. గతనెల 28తో సర్వే, ఈనెల 2తో అందుబాటులో లేని ప్రజల వివరాలను నమోదు చేసే ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. అయితే అందుబాటులో లేని వారి వివరాలను సేకరించడంలో ఆలస్యం జరుగుతోంది. ఇదిలా ఉంటే ద్వారకాతిరుమల మండలంలో పారదర్శకంగా సర్వే చేసేందుకు 20 సచివాలయాల పరిధిలోని 420 మంది వలంటీర్లు, దాదాపు 170 మంది సచివాలయ సిబ్బంది, మండల అధికారులు శ్రమిస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో 95.33 శాతం సర్వే పూర్తయింది. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఉన్నత చదువులు, ఉపాధి, ఉద్యోగ కల్పనకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఈ సర్వే ఎంతగానో ఉపకరించనుంది. దేశంలో ఈ కులగణన చేస్తున్న ఒకే ఒక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందడం విశేషం.

వందేళ్ల తర్వాత కులగణన..

1881లో దేశంలో తొలిసారిగా జనాభా లెక్కలతో పాటు కులగణన చేశారు. అనంతరం 1921 వరకు పదేళ్లకు ఒకసారి కులగణన చేస్తూ వచ్చారు. ఆ తర్వాత కుల గణనను నిలిపివేసి, కేవలం జనగణన మాత్రమే చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వందేళ్ల తర్వాత రాష్ట్రంలో కుల గణన చేపట్టారు. సుదీర్ఘకాలంగా కుల సంఘాల నుంచి కుల గణన చేపట్టాలనే డిమాండ్లు వస్తున్నా గత ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. దాంతో రిజర్వేషన్లు, ప్రభుత్వ పథకాల అమలులో ఎన్నో ఉప కులాల వారికి తీవ్ర అన్యాయం జరుగుతోందన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో కుల గణన సర్వే నిర్వహణ కోసం ప్రభుత్వం జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులకు అవసరమైన శిక్షణ ఇచ్చి, తగిన ఏర్పాట్లు చేసింది.

కుల గణన చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ

రాష్ట్ర వ్యాప్తంగా 726 కులాలు, ఉప కులాలకు సంబంధించి కుల గణన జరుగుతోంది. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాలతో పాటు ఎంత మంది ఏ ఉపకులాల జనాభాలో ఉన్నారు, వారి స్థితిగతులు తెలుసుకునేందుకు సర్వేలో వివరాలను సేకరిస్తున్నారు. ఈనెల 15 వరకు సేకరించిన సమాచారాన్ని సచివాలయాల్లో క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తారు.

సర్వే ప్రక్రియ ఇలా..

కులగణన సర్వేలో కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలనే సిబ్బంది నమోదు చేస్తారు. వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఏవీ అడగరు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి వారి కులం వరకే నమోదు చేస్తారు. స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న సర్వేలో ఎవరైనా కులం పేరు చెప్పేందుకు ఇష్టపడకుంటే బలవంతం చేయరు. సేకరించిన సమాచారం ప్రభుత్వం వద్ద భద్రంగా ఉంటుంది. ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులకు వెళ్లదు. వివరాలు నమోదు చేసినా ఈకేవైసీ తప్పనిసరిగా తీసుకోవాలి. 8 ఏళ్ల లోపు వయస్సు గల పిల్లలకు ఈకేవైసీ తప్పనిసరి కాదు. సర్వే పూర్తి చేసిన తర్వాత సచివాలయ సిబ్బంది, వలంటీర్ బయోమెట్రిక్ వేసి వివరాలను నివేదిస్తారు.

సేకరిస్తున్న వివరాలు ఇవీ

- కుటుంబ సభ్యులు అందుబాటులో ఉన్నారా.. మరణించారా.. శాశ్వతంగా వలస వెళ్లారా
- జిల్లా, జిల్లా కోడ్, మండలం / మున్సిపాలిటీ, గ్రామం, పంచాయతీ, పంచాయతీ కోడ్, వార్డు, ఇంటి నంబర్లు
- కుటుంబ పెద్ద పేరు, ఆధార్ నంబర్, కుటుంబ సభ్యుల సంఖ్య, కుటుంబ సభ్యుల పేర్లు, కుటుంబ పెద్దతో ఉన్న సంబంధం, రేషన్ కార్డు నంబర్
- కుటుంబం నివాసం ఉంటున్న ఇంటి పరిస్థితి, ప్రస్తుత చిరునామా, మరుగుదొడ్డి ఉందా లేదా
- తాగునీటి సదుపాయం, పశు సంపద వివరాలు, వంట సాధనం వివరాలు
- కుటుంబ సభ్యుని పేరు, తండ్రి పేరు, జెండర్, పుట్టిన తేదీ, వైవాహిక స్థితి, కులం, ఉపకులం, మతం, విద్యార్హత, వృత్తి, వ్యవసాయ భూమి వివరాలు, నివాస స్థలం వివరాలు

పారదర్శకంగా సర్వే



ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే ద్వారకాతిరుమల మండలంలో పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. అందుకు పక్కాగా చర్యలు తీసుకున్నాం. సర్వేలో సేకరించిన వివరాలను గోప్యతతో పాటు భద్రంగా ఉంచుతాం. దాదాపు వందేళ్ల తర్వాత కులగణన జరుగుతోంది. ఈ సర్వేతో ప్రభుత్వ పథకాలు మరింతగా ప్రజలకు చేరువవుతాయి. బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాలకు మరింత మేలు కలిగించేందుకు ఉపకరిస్తుంది.

– ఆర్.తిరుపతిరావు, ఎంపీడీవో, ద్వారకాతిరుమల

అందరికీ సమ న్యాయం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకు అతీతంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ సమన్యాయం చేస్తున్నారు. బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాలకు మరింత సంక్షేమం అందించేందుకు కులగణనను చేపట్టారు. వందేళ్ల తరువాత దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగని కులగణన మన రాష్ట్రంలో జరుగుతోంది. సంక్షేమం, అభివృద్ధితో పాటు అన్నింటిలోనూ మన రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

– తానేటి వనిత, రాష్ట్ర హోంశాఖ మంత్రి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి

క్లుప్తంగా

రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్‌గా జ్యోతిక రెడ్డి


రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్‌గా జ్యోతిక రెడ్డి

జంగారెడ్డిగూడెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్‌గా దల్లి సాయి జ్యోతిక రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెకు నియామక ఉత్తర్వులు అందాయి. ప్రస్తుతం మండలంలోని గుర్వాయిగూడెం పీపీసీఎస్ డైరెక్టర్‌గా ఆమె బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా ఉంటూ, పార్టీ అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తున్నారు. పార్టీని మహిళలకు మరింత చేరువ చేసే విధంగా ఆమె పనిచేస్తున్నారు. ఆమె సేవలను గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పలువురు పెద్దలు, పార్టీ సీనియర్ నాయకులు జ్యోతికరెడ్డికి అభినందనలు తెలిపారు.

రామాలయ పునర్నిర్మాణానికి రూ.3 లక్షల చెక్కు అందజేత


రూ.3 లక్షల చెక్కును అందజేస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు

జంగారెడ్డిగూడెం రూరల్: దేవులపల్లిలో కోదండ రామాలయ పునర్నిర్మాణానికి ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు రూ.3 లక్షల చెక్కు అందజేశారు. ఈ చెక్కును ఎంపీ తన కార్యాలయంలో కమిటీకి అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు బుడేకుల పాపారావు మాట్లాడుతూ ఆలయ నిర్మాణ విషయాన్ని ఎంపీ శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా రూ.10 లక్షలు దేవదాయ శాఖ ద్వారా అందించేలా కృషి చేశారని, ముందుగా మంజూరైన రూ.3 లక్షల చెక్కును అంజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కట్టూరి విజయరాజు, ప్రగడ గోపాల్, కట్టూరి యువరాజు పాల్గొన్నారు.

సిద్ధం సభ విజయవంతంపై హర్షం


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, బీసీ నాయకులు ఘంటా ప్రసాదరావు

ఏలూరు(మెట్రో): దెందులూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన సిద్ధం సభ విజయవంతమైందని, పార్టీ కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపిందని, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. సిద్ధం సభ విజయవంతంపై స్థానిక జెడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం జగనన్న కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపారని, ఎన్నికలకు సిద్ధంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉన్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయం వైఎస్సార్ సీపీదే అని ఆమె ధీమా వ్యక్తం చేశారు. సిద్ధం సభ జిల్లాలో ఏర్పాటు చేయడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. మూడు జిల్లాల నాయకులు, కార్యకర్తలు జిల్లాకు చేరుకోవడం, సభ విజయవంతం కావడం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపిందన్నారు. సమావేశంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ జగనన్న సిద్ధం సభ విజయవంతమవడంతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ గుండెల్లో గుబులు మొదలైందన్నారు. ఎన్ని శక్తులు అడ్డొచ్చినా, వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరని ఆయన అన్నారు.

రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్

ఏలూరు(మెట్రో): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏలూరు జిల్లా అధ్యక్షుడు కంచెర్లపల్లి రమేష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన పదోన్నతులలో రాష్ట్ర ప్రధాన కాదర్శిగా ఉన్న చేబ్రోలు కృష్ణమూర్తి డిప్యూటీ కలెక్టర్‌గా పదన్నోతి పొందడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో కార్యవర్గ సమావేశంలో నూతన కార్యదర్శి ఎన్నిక నిర్వహించారు. కో-అప్షన్ ద్వారా ప్రస్తుత ఏలూరు జిల్లా అధ్యక్షుడు కంచెర్లపల్లి రమేష్‌కుమార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైనట్లు జిల్లా రెవెన్యూ అసోసియేషన్ నాయకులు తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో స్వచ్ఛభారత్ నిర్వహణ

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ – 3 ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఫ్యాకల్టీ బ్లాక్‌ల వెనుక ఉన్న చెత్తచెదారాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలను, పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రావణి అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవడం, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ – 3 ప్రోగ్రాం ఆఫీసర్ జాజుల మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

10 నుంచి కార్యసిద్ధి ఆంజనేయ పంచమ వార్షికోత్సవం



కొయ్యలగూడెం: పొంగుటూరు పంచాయతీ కన్నాయిగూడెం గ్రామంలోని శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి పంచమ వార్షికోత్సవం ఈనెల 10వ తేదీ నుంచి 12 వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా 10వ తేదీన శ్రీ విఘ్నేశ్వర పుణ్యాహవచనం, కలసస్థాపన, హనుమద్ వ్రతాలతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 11వ తేదీన లక్ష పుష్పార్చన, 12న సువర్చలా సమేత హనుమద్ కల్యాణం, అదేరోజు సాయంత్రం నుంచి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్ ఆశయ సాధన కోసం కృషి


దర్భగూడెంలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. జీలుగుమిల్లి మండలం దర్భగూడెం ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్సార్ ప్రజాసంక్షేమం కోసం చేసిన కృషిని కొనియాడారు. గ్రామంలో సుమారు రూ.52 లక్షల వ్యయంతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బోర్‌ను ప్రారంభించారు. అనంతరం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సమన్వయకర్త రాజలక్ష్మి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు, సర్పంచ్ సున్నం ఉషారాణి, ఉపసర్పంచ్ కేతిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీటీసీ సుధారాణి, సచివాలయ కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు కుమ్మరికుంట ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి తిరుగులేని మెజార్టీ ఖాయం


సీహెచ్ జ్ఞానారెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి

చింతలపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తిరుగులేని మెజారిటీ సాధించి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి అన్నారు. ఆదివారం చింతలపూడిలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌కు పెరుగుతున్న జనాదరణ చూసి టీడీపీ, జనసేన నాయకులకు నిద్ర పట్టడం లేదని చెప్పారు. దెందులూరు సిద్ధం సభకు వచ్చిన లక్షలాది మంది ప్రజలే ఇందుకు నిదర్శనమన్నారు. అవినీతికి, లంచాలకు తావు లేకుండా సంక్షేమ పాలన అందిస్తున్న పార్టీ దేశంలో వైఎస్సార్ సీపీ ఒక్కటేనన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయంగా, సామాజికంగా సముచిత స్థానం కల్పించారని కొనియాడారు. పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ విద్య, వైద్యం అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని గుర్తు చేశారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వైఎస్సార్ సీపీకి ఓటు వేసి సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. జీలుగుమిల్లి మండలం దర్భగూడెం సొసైటీ అధ్యక్షుడు కొల్లూరి రాంబాబు సతీమణి పద్మావతి రెండో వర్ధంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మితోపాటు ఎమ్మెల్సీ శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మావతికి ఘన నివాళులు అర్పించి పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం పలు కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సున్నం ఉషారాణి, ఉపసర్పంచ్ కేతిరెడ్డి రాఘవరెడ్డి, సచివాలయ కన్వీనర్ పైడిమర్ల జగన్‌మోహన్‌రెడ్డి, గుర్రాల సురేష్, కుమ్మరిపల్లి ప్రకాశం, పొంగులేటి సత్యవతి, కొప్పుల చౌదరారెడ్డి, ఎంపీటీసీ సున్నం సురేష్, నాగేషు, పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

11న యాదవ సంఘ భవనం ప్రారంభోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఏలూరు జిల్లా యాదవ సంఘం భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఈ నెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే ఆళ్ల నాని చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు ఏలూరు జిల్లా యాదవ సంఘం నాయకులు తెలిపారు. ఏలూరులోని సంఘం కార్యాలయంలో ఆదివారం సంఘ జిల్లా అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కు సూరి గోపాలకృష్ణ తదితరులు సంఘ భవన ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని జిల్లా యాదవుల అవసరాలను, ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుని ఏలూరు నడిబొడ్డున తమ్మిలేరు ఒడ్డున భవన నిర్మాణానికి విలువైన స్థలాన్ని, రూ.14 లక్షలు ప్రభుత్వ నిధులు మంజూరు చేశారని తెలిపారు. వాటితోపాటు యాదవ సోదరులు అందించిన విరాళాలతో భవనాన్ని నిర్మించామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు, జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ , రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్ యాదవ్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కారుమూరి సునీల్ కుమార్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి పాల్గొంటారని తెలిపారు.

సమన్వయ కమిటీతో సరి


చింతాలమ్మ ఆలయం వద్ద నిర్వహించిన సమావేశంలో గ్రామ పెద్దలు వాగ్వివాదం చేసుకుంటున్న దృశ్యం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం గ్రామదేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారి ఆలయ కమిటీకి ప్రత్యామ్నాయంగా సమన్వయ కమిటీతో సరిపుచ్చారు. ఆదివారం ఆలయ కమిటీ ప్రస్తుత అధ్యక్షుడు కటారి సుబ్బారావు ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సమావేశం నిర్వహించారు. ఇందులో అఖిల పక్ష రాజకీయ పార్టీలకు చెందిన వారు పాల్గొన్నారు. నూతన కమిటీని ఏర్పాటు చేసి నూతన ఆలయ నిర్మాణానికి కొందరు పెద్దలు సంకల్పించగా దీనిని మరికొందరు వ్యతిరేకించారు. అమ్మవారి నూతన ఆలయ నిర్మాణం పిదపనే పాలకమండలి కమిటీని ఏర్పాటు చేయాల్సిందిగా, అంతవరకు సమన్వయ కమిటీతో ఆలయ నిర్మాణం చేపట్టాల్సిందిగా కొందరు సూచించారు. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దల మధ్య ఏకాభిప్రాయం రాకపోగా వాగ్వివాద ఘటనలు పలుమార్లు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతానికి కొందరి పేరున డిపాజిట్ చేసి ఉన్న సుమారు రూ.45 లక్షల నిధుల వినియోగంపై చర్చించారు. తుదకు పదిహేను మందితో సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. ఈనెల 12వ తేదీ మరోమారు కమిటీ ఏర్పాటు చేసి నూతన ఆలయ నిర్మాణంపై గ్రామ పురోహితుల సమక్షంలో నిర్ణయం తీసుకుంటామని ఆలయ కార్యదర్శి పొన్నా రామచంద్రరావు పేర్కొన్నారు. గ్రామ పెద్దలు తమ వ్యక్తిగత స్పర్థలను వీడి త్వరితగతిన ఆలయ నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామంలోని మిగిలిన హిందూ దేవాలయాలు ఇప్పటికే కొన్ని పునర్నిర్మాణం పూర్తి చేసుకున్నాయని, మరికొన్ని అభివృద్ధి దశలో ఉన్నాయని, కానీ గ్రామ దేవత ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పందెంరాయుడి బైండోవర్

ముసునూరు: కోడిపందేల కోసం వెళుతున్న వ్యక్తిని పట్టుకుని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై పి.వాసు తెలిపారు. ఆదివారం లింగపాలెం మండలంకు చెందిన డి. సురేష్ మండలంలోని లోపూడిలో కోడిపందేలు వేసేందుకు కొంతమందితో కలిసి వస్తుండగా ముందస్తు సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. అతడిని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎదుట హాజరుపర్చగా రూ.లక్ష పూచీకత్తుపై బైండోవర్ విధించినట్లు ఎస్సై చెప్పారు. ఈదాడిలో ముసునూరు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంకల్పంతో విజయాలు అందుకోవాలి

రచయిత, పద్మశ్రీ ఇనాక్


రచయిత, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ద్వారకాతిరుమల: విద్యార్థి దశలోనే లక్ష్య సాధన ఏర్పాటు చేసుకుని, గట్టి సంకల్పంతో విజయాలను అందుకోవాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, రచయిత, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ మండలంలోని పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు సూచించారు. ముందుగా పాఠశాలకు విచ్చేసిన ఇనాక్‌కు ప్రధానోపాధ్యాయుడు పి.సురేష్, తెలుగు పండిట్ మద్దాల పెద్దిరాజు, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాశం గురించి వివరిస్తూ తాను ఆకలి బాధలను, వివక్షతను ఎదుర్కొని కష్టపడి చదివి ఉపకులపతి, పద్మశ్రీ వరకు ఎదిగానన్నారు. జీవితంలో కష్టపడి ప్రయత్నించే వారికి ఈ ప్రపంచం సహాయపడుతుందన్నారు. తెలుగు సాహిత్యంలో వచ్చే కథలు, కవితలు చదివి సామాజిక స్పృహ అలవరచుకోవాలని సూచించారు. అనంతరం 9వ తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో ఇనాక్ రచించిన 'కొలిమి' కథలోని సామాజిక అంశాలను విద్యార్థులు అభిషేక్, అనిల్ ఆయనకు విశ్లేషించారు. ఆ తరువాత ఇనాక్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, ప్రభాకరరావు, రమేష్ తదితరులున్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా

కొయ్యలగూడెం: వైఎస్సార్ ఆసరా కార్యక్రమం కొయ్యలగూడెంలోని ఏఎంసీ యార్డు ప్రాంగణంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ఆసరా చెక్కులను పంపిణీ చేస్తారన్నారు. నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఇప్పటికే సమాచారం అందజేయడం జరిగిందని, వారందరూ వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్దకు ఉదయం పది గంటలకు హాజరు కావాల్సిందిగా సూచించారు.

కాంగ్రెస్ పార్టీకి కృష్ణంరాజు రాజీనామా

జంగారెడ్డిగూడెం రూరల్: కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మండలంలోని పుట్లగట్లగూడెంకి చెందిన శీలం కృష్ణంరాజు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని అనివార్య కారణాల వల్ల కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఏపీసీసీ కోఆప్షన్ సభ్యత్వానికి, రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తన రాజీనామా పత్రాలను పార్టీ అధిష్టానానికి అందజేసినట్లు పేర్కొన్నారు.

జబర్దస్త్ కళాకారుల సందడి


దొరమామిడిలో కళాప్రదర్శన ఇస్తున్న జబర్దస్త్ కళాకారులు

బుట్టాయగూడెం: ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో ఆదివారం జబర్దస్త్ కళాకారులు సందడి చేశారు. బీజేపీ ఏలూరు ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగబోతున్న గారపాటి చౌదరి ఆధ్వర్యంలో కళాకారులు అదిరే అభి, అప్పారావు, బాబి, వినోదిని, ఇస్మాయేల్, తదితరులు కళాప్రదర్శనలు ఇవ్వడం జరిగింది. బుట్టాయగూడెం, దొరమామిడి, అంతర్వేదిగూడెం, రెడ్డిగణపవరం గ్రామాల్లో కళా ప్రదర్శన ద్వారా బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. అదేవిధంగా గడిచిన 16 ఏళ్లుగా తపన ఫౌండేషన్ ద్వారా గారపాటి చౌదరి చేసిన సేవలను కూడా జబర్దస్త్ టీమ్ ప్రచారం చేయడం జరిగింది. అలాగే సినీ గాయకులు లాస్యప్రియ, అరుణ్ కౌండిన్య కూడా పాటలు పాడి అలరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మొడియం శ్రీనివాసరావు, కొండేపాటి రామకృష్ణ, వంకా కాంచనమాల, తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన గుబ్బల మంగమ్మ ఆలయం


అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువై పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మతల్లిని ఆదివారం పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రైవేటు బస్సులు, మినీ వ్యాన్‌లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అలాగే మండలంలోని మర్లగూడెం అటవీప్రాంతంలో కొలువై ఉన్న పాటిమ్మ తల్లి, దుర్గమ్మ తల్లిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎమ్మెల్యే కొఠారును కలిసిన పెదవేగి ఎస్సై

దెందులూరు: పెదవేగి మండల నూతన ఎస్సైగా రాజేంద్రప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఆదివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఎస్సై కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

గాయపడిన జర్నలిస్టుకు ఎమ్మెల్యే పరామర్శ

దెందులూరు: దెందులూరు 'సిద్ధం' సభలో అనారోగ్యానికి గురైన జర్నలిస్టును ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదివారం పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆయన సూచించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాద్, ఏపీడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.మాణిక్యరావు ఉన్నారు.